# 2

# విలువలు

చదువుకునే రోజుల్లో జీవితం అంటే పూలబాట అనుకునే వాడు రఘు. చదువు ముగించాక గానీ తెలియలేదు. పూలబాట సిద్ధంగా పరచి ఉండదు... ఎవరికి వారు పూలబాట చేసుకునేందుకు అహర్నిశలూ శ్రమించాలి అని... ఉద్యోగ ప్రయత్నాల్లో విసుగొచ్చేసింది. అసలు ఏ ఉద్యోగమూ దొరకలేదని కాదు... దొరికిన ఉద్యోగాల్లో దేన్లోనయినా చేరేందుకు నామోషీ అనిపించింది. తన తండ్రి ఒక ఆఫీసర్ పోస్ట్‌లో రిటైరయ్యారు. ఆఫీసర్‌గారి కొడుకు తాను చిన్న ఉద్యోగం చెయ్యడమా అన్న ఆలోచన పురుగులా బుర్రలో దూరింది.

ఎలాగో అలా ఎవర్నో ఒకర్ని పట్టుకుని పెద్ద ఉద్యోగం వేయించకూడదా ఆయన? రోజులు చక్రంలా దొర్లిపోతున్నాయి. వాదనకి దిగాడు ఓ రోజు తండ్రితో.

"మీకు తెల్సిన వాళ్ళలో పెద్ద పెద్ద వాళ్ళుంటారు కదా. వాళ్ళ సిఫారసుతో నాకో మంచి పెద్ద ఉద్యోగం ఎందుకు వేయించరూ?"

"అలాంటి పన్లు నాకు తెలియవురా" ఉన్న మాటే చెప్పాడు రామ్మూర్తి.

"మీ ఉద్యోగంలో మీరెవరి అండదండలకోసం పాకులాడకుండానే రిటైర్ అయ్యేదాకా నెగ్గుకొచ్చారా మీరు?"

కొడుకు అలా అడిగినందుకు... వాడి మనసులో అలాంటి ఆలోచన కలిగినందుకు బాధనిపించింది రామ్మూర్తికి. తన సంగతి తెలిసి కూడా ఆ మాట అనడం సమంజసమేనా? కానీ కొడుకావిధమైన ప్రశ్న సంధించినప్పుడు సమాధానం చెప్పక తప్పదు కదా!

"నా ఉద్యోగ ధర్మం నేను నిర్వర్తిస్తూ రిటైరయ్యాను. ప్రమోషన్ల కోసం ఎప్పుడూ తప్పుదారి తొక్కలేదు. అందని వాటికోసం అర్రులు చాచలేదు. ఎవరిచేతా మాటనిపించుకోలేదు".

"చిన్న చిన్న ఉద్యోగాల్లో చచ్చినా చేరను" రివ్వున బాణంలా దూసుకొచ్చింది మాట.

కొడుకు మాటలకి భూదేవి కల్పించుకోకుండా ఉండలేకపోయింది.

"పాడిందే పాడరా అని... నీ మొండి పట్టుదలా నువ్వూనూ... చిన్న ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా పైకొచ్చారు మీ నాన్నగారు. నువ్వూ అలా పైకిరావాలి గానీ..."

"అమ్మా! ఆ రోజులు వేరు... ఈ రోజులు వేరు... ఉద్యోగాల్లో చేరడమే నెలకి పాతికవేలు ముప్ఫయ్ వేలల్లో చేరుతున్నారు".

నవ్వాలో ఏడవాలో తెలియలేదు భూదేవికి.

"వాళ్ళు చదివిన చదువులు వేరు... వాళ్ళకొచ్చిన మార్కులు వేరు. నీ సంగతలా కాదు కదా ఒక్కొక్క తరగతీ రెండేసేళ్ళు చదువుతూ.... చదువంటే నిర్లక్ష్యంతో... బయట జులాయి తిరుగుళ్ళల్లో గడుపుతూ విలువైన కాలాన్ని కరగబెట్టుకున్నావు. మంచీచెడూ తెలియజెప్పిన అమ్మానాన్నల్ని శత్రువుల్లా చూశావు. డింకీలు కొడుతూ బి.ఏ. డిగ్రీ అయిందనిపించావు"... ఈ మాటలన్నీ ఆవిడ గొంతులోనే ఉండిపోయాయి.

తనని చిన్నబుచ్చడానికే అమ్మ ఈ మాటలందని అనుకుంటాడు తప్ప తన తప్పు ఒప్పుకునే మనిషి కానప్పుడు ఏం మాట్లాడి ఏం లాభం?

కొడుకు మాటలకి రామ్మూర్తికి నవ్వూ కాదు ఏడుపూ కాదు. కోపం వచ్చిన మాట నిజం... కానీ.. ఊరుకున్నంత ఉత్తమం బోడి గుండంత సుఖం అని కోపంగా ఉన్నప్పుడు మాట్లాడక పోవడమే మంచిదని నిగ్రహించుకున్నాడు. తెలిసిన వాడికి చెప్పవచ్చు... తెలియనివాడికి చెప్పవచ్చు... తెలిసీతెలియని మూర్ఖుల కెందుకూ చెప్పడం?... తండ్రి వెళ్ళి వీళ్ళ కాళ్ళూ వాళ్ళ కాళ్ళూ పట్టుకోవట్లేదని... అప్పులు చేసి ఎవరికీ లంచాలు గుమ్మరించట్లేదనీ... తనకి పెద్ద ఆఫీసర్ ఉద్యోగం వేయించట్లేదని ఆయన్నొక చేతకాని వాడికింద జమకట్టి మాటలంటుంటే ఇంక భరించలేక పోయింది భూదేవి.

"అభిమాన హీరో... అభిమాన సంఘం అంటూ చదువులూ పరీక్షలూ గడ్డిపోచలా తీసిపడేసి తిరుగుళ్ళు తిరిగినప్పుడు నీ భవిష్యత్తు గురించి ఆలోచన నీకు లేదా? నీ ఉద్యోగాల చింతన మనసులో కొంచెమైనా లేదా? చేజేతులా భవిష్యత్తు పాడు చేసుకున్నావు. దానివల్ల నువ్వొక్కడివే కాదు... నీతో పాటూ మేము కూడా శిక్ష అనుభవించాలి తెలుసా?"

మరొక్క నిమిషం అక్కడ నిలబడకుండా చిరాకు పడుతూ విసురుగా బయటికి వెళ్ళిపోయాడు రఘు.

"పోనీ ఇంకా చదువుకుంటావా లేదా ఇంకేదైనా కోర్సు చేస్తావా అంటే దేనిమీదా ఆసక్తి లేదంటున్నాడు... ఏం చెయ్యాలో తెలియట్లేదు... ఆ భగవంతుడే ఒక దారి చూపించాలి మనకి" పైకి చూస్తూ చేతులు జోడించాడు రామ్మూర్తి.

చిన్నప్పుడే మాట వినని వాడు ఇప్పుడు వినిపించుకోవాలనుకోవడం అత్యాశేనేమో?... ఆయనకి తన చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయి. బాల్యం మళ్ళీ కావాలనిపించింది. కాలం ముందుకి కాదు వెనక్కి కదిలితే ఎంత బాగుంటుంది!... పిల్లలకీ పెద్దలకీ ప్రశాంత జీవితాలు కాదూ ఆ రోజులు? ఈర్ష్యద్వేషం వ్యామోహాలతో అనారోగ్యకర పోటీలు మితిమీరిన ఈ రోజుల్లో ప్రశాంతత ఎక్కడుంది? మంచీ చెడూ చెప్పే తల్లిదండ్రుల్ని ఖాతరు చెయ్యకపోవడమే ఒక ఫ్యాషన్‌గా భావించే పిల్లలు ఈ సమాజాన్ని ఎక్కడికి తీసుకుపోతున్నట్టు?... నాగరికత పేరుతో కొందరు వేసే వేషాలు... ప్రవర్తించే తీరు... పోయే పోకడలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చెయ్యట్లేదూ?

పెరుగుట విరుగుట కొరకే అంటారు మరి... మళ్ళీ వెనకటి రోజులొస్తాయేమో! అయినా శారీరక ఆరోగ్యం గురించి... ఒంటి అందాలు మెరుగు పరుచుకునే విషయాల కోసమూ తెగతాపత్రయ పడిపోయే యువత... మానసిక ఆరోగ్యం గురించి ఆలోచిస్తున్నట్టు లేదు. మానసిక ప్రశాంతత లేనప్పుడు మనసుకి ఆరోగ్యం చేకూరేదెలాగ? మానసిక ఆరోగ్యం దూరమైనప్పుడు శారీరక అనారోగ్యం చేరువైనట్టేగా?... శరీరానికి మందులు గుప్పించి ప్రయోజనం ఏవుంది మనసులో ప్రశాంతతకి చోటే లేనప్పుడు... పిల్లల బాగోగులు ఆలోచించి పెద్దలు చెప్పిన మాటల్ని తానెప్పుడూ పెడచెవిని పెట్టడం గానీ కొట్టి పారెయ్యడం గానీ తన చిన్నప్పుడు

చెయ్యలేదు. అలా చేస్తే నష్టపోయేది తనే కదా... మరి ఈ రోజుల్లో?... తమ బాగుకోసమే ఇంట్లో వాళ్ళు చెప్తున్నారన్న ఇంగిత జ్ఞానం కరువై పోతోంది ఈ కాలం పిల్లలకి... ఇటువంటి పిల్లలు బయటివాళ్ళ చేత చెప్పించుకుని గడ్డి తింటున్నారు. ఇంట్లో పెద్దవాళ్ళు సిగ్గుతో తలదించు కోవలసిందే. ఇంతంత సంపాదనలు లేకపోయినా ఇదివరకటి రోజులు బంగారు రోజులే. ఇంట్లోని వాళ్ళతో సంప్రదింపులు సలహాలు ఆచరణలో ఉండేవి. బయటి వాళ్ళచేత కౌన్సిలింగ్ అంటూ వెళ్ళాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడో?... పెద్దలు చెప్పినట్టు ఎందుకు వినాలన్న మొండితనం పంతం కలిసిన ధోరణితో పరిస్థితులు ఆగమ్య గోచరంగా చేసుకుంటూ... బుర్ర వేడెక్కించుకుని కౌన్సిలింగ్ అంటూ ఎవరి దగ్గరికో పరిగెత్తడం... నష్టపోతున్న దెవరు? భవిష్యత్తు తమ ముందున్న యువతీ యువకులేగా?

ఆలోచనల్లో ఉన్న రామ్మూర్తికి తన కొడుకు తరచుగా అనే మాట ఒకటి గుర్తొచ్చింది. మీ పెద్దవాళ్ళు దేనికీ ఎడ్జస్టు అవరు... అవలేరు... అంటూ చాలా తరచుగా అనవసరమైన విమర్శ గుప్పిస్తూ ఉంటాడు. ప్రతి విషయంలోనూ తాము ఎడ్జస్టు అయిపోతూనే ఉన్నారు కొడుకు ప్రవర్తనకి మనసు కుంగిపోతున్నా కూడా. అవలేకపోతున్నది తానే అని అర్థం చేసుకోడే? చెప్పినా ప్రయోజనం శూన్యం. మొక్కయి వంగనిది మానై వొంగుతుందా?

✧ ✧ ✧

హఠాత్తుగా ఒక రోజు ఎవరో అమ్మాయితో కలిసి ఇంట్లో అడుగుపెట్టాడు రఘు.

"నందినీ నేనూ రిజిష్టర్ పెళ్ళి చేసుకున్నాం" ముక్తసరిగా అన్నాడు అమ్మా నాన్నలతో.

తెల్లబోయి చూస్తున్న వాళ్ళ ఆశ్చర్యాన్ని తప్పుగా అర్థం చేసుకున్నాడు.

"ఈ పెద్దవాళ్ళెప్పుడూ ఇంతే. దేనికీ సర్దుకుపోయే మనస్తత్వాలు కావు. నువ్వు లోపలికి పద నందినీ" అంటూనే ఆమెకి తన గదిలోకి దారి చూపించాడు.

"నందినీ వాళ్ళమ్మా నాన్నగారూ తన చిన్నప్పుడే పోయారట. మేనత్త ఇంట్లో పెరిగిందట. ఇప్పుడావిడ లేరు. తను టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. నేను సంపాదించక పోయినా తను సంపాదిస్తోందిలే" గర్వంగా చెప్పాడు తల్లి దగ్గరకొచ్చి.

కొడుకన్న చివరి మాటకి చివుక్కుమంది భూదేవి మనసు. కోడలు సంపాదిస్తుంది కాబట్టి కొడుకు సోమరిపోతులా కూచున్నా ఫర్వాలేదని సమర్థిస్తుందా తను?... ఎందుకింత పొరపాటుగా ఆలోచిస్తున్నాడు?

✧ ✧ ✧

రెండు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఎంత మందికో అవి పరిగెత్తినట్టే అనిపించి ఉండచ్చు. రామ్మూర్తి భూదేవిలకవి మౌనాన్ని ఆశ్రయించిన రోజులయ్యాయి. నవదంపతుల మధ్య ఏవాద వివాదాలొచ్చినా ఏ గొడవలొచ్చినా అత్తమామలు కారణమైనా కాకపోయినా కూడా వారి వంకే వేలు చూపే కాలమైపోయిందని భూదేవి వంటిల్లే తన స్థావరంగా అంకితమై పోయింది. బయటి వరండాలోని పడక్కుర్చీ వొదలని నేస్తమైంది రామ్మూర్తికి.

హఠాత్తుగా ఒక రోజు నందిని ఏడుస్తూ వొచ్చి భూదేవి కాళ్ళమీద పడింది. ఏం జరిగిందో నన్న భయంతో గుండె కొట్టుకోవడం ఒక్క క్షణం ఆగిపోయినట్లని పించింది భూదేవికి. రెండు చేతుల్తో ఆప్యాయంగా పట్టుకుని కోడల్ని పైకి లేవదీసింది. "ఏం జరిగిందమ్మా?"

"మీరూ మావయ్యగారే ఆయనకి నచ్చచెప్పాలి. నాకు పిల్లలు పుట్టరని ఈ మధ్య డాక్టరు పరీక్షల్లో తెలిసింది. ఆ రోజునించీ నాకు విడాకులిచ్చేస్తాననీ... తను వేరే పెళ్ళి చేసుకుంటాననీ రఘు చాలా వేధిస్తున్నాడు. మానసికంగా చిత్రహింస పెడుతున్నాడు. అతన్నే నమ్ముకుని వొచ్చిన దాన్నే... నా ఉద్యోగం నేను చేసుకుంటూ బతకలేకపోను. కానీ మనిషన్నాక న్యాయం ఉండాలా వొద్దా మీరే చెప్పండి?"

గుమ్మంలో అడుగు పెడుతున్న రామ్మూర్తి కోడలి మాటలు విని తల్లడిల్లి పోయాడు.

"ఊరుకోమ్మా... ఏడవకు. నీకు అన్యాయం జరగనివ్వం" ఓదార్చింది భూదేవి.

ఆ రాత్రి కొడుకుతో తల్లిదండ్రులిద్దరూ మాట్లాడారు.

రఘుది ఒకటే మాట. ఇంకో పెళ్ళి చేసుకుంటానని.

చెప్పలేనంత ఆశ్చర్యమనిపించింది వాళ్ళకి...

ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు... ఇదేనా ప్రేమంటే?

రాత్రంతా కంటిమీద కునుకు లేదు వాళ్ళిద్దరికీ...

మర్నాడు ఏదో పనుండి బయటికి వెళ్ళిన రామ్మూర్తి ఊరి సెంటర్లో అంత జన సందోహాన్ని చూసి ఏం జరిగిందో ఏమయ్యిందోనని ఒక పక్కగా నిలబడ్డాడు. ఆకాశమంతెత్తున అభిమాన హీరో బొమ్మని పెట్టి పాలాభిషేకం చేస్తున్నారు అభిమాన సంఘం వాళ్ళు. ఇసకేస్తే రాలని జనాల తోపులాటలు.

"అయ్యా! ఒక్కసారి మా తమ్ముడిని పట్టుకోండయ్యా! అన్ని పాలు పారబోస్తున్నారు వాళ్ళు. ఓ గ్లాసుడు పాలు తమ్ముడికోసం పొయ్యమని బతిమాలి తెచ్చుకుంటాను..." ఎనిమిదేళ్ళుంటాయేమో ఆ కుర్రాడికి. వాడి మాట పూర్తికానే లేదు... సుమారు నాలుగు నెల్ల పసిబిడ్డ రామ్మూర్తి చేతుల్లో.

తెల్లబోయి చూశాడు. "మీ అమ్మా నాన్నా ఏరీ?"

"ఇద్దరూ చచ్చిపోయారయ్యా. పక్క ఊరే మాది... ఏదో ఓ పని చేసుకుని బతుకుదామని ఈ పొద్దే ఈ ఊరొచ్చాను".

చెప్తూనే... చేతిలో సత్తు గ్లాసు భుజాన జోలెతో జనంలోకి చొచ్చుకు పోతున్న ఆ కుర్రాడిని చూస్తూ కంగారు పడ్డాడు రామ్మూర్తి. "అంత జనంలోకి వెళ్ళకు పాలు కొనడానికి డబ్బులు నేనిస్తాను" అని వెనక్కి పిలిచాడు.

అరుపుల్లో గోలలో ఆయన మాటలు వాడిని చేరనే లేదు.

తొక్కిసలాటలో వాడు కింద పడటం... వాడి తల సరిగ్గా ఓ రాయి మీద పడడం వాడి మీంచి ఓ నలుగురు తొక్కుకుంటూ పోవటం... వాడి ప్రాణం గాల్లో కలవటం అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

✧ ✧ ✧

ఇంట్లో అడుగు పెడుతూనే... కళ్ళనీళ్ళతో గద్గదికమైన గొంతుతో తన భర్తని బతిమాలుకుంటున్న కోడల్ని... జాలి గొలిపే స్వరంతో శత విధాల కొడుక్కి నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తున్న భార్యనీ చూశాడు రామ్మూర్తి.

నిన్నగా కొడుకూ కోడలి దగ్గరికి అడుగులు వేశాడు.

"ఇదిగో మీ బిడ్డ".

అప్రయత్నంగా చేతులు చాచి ఆనందంగా అందుకుంది నందిని మామగారి చేతుల్లోంచి పసిబిడ్డని. ఎవరు... ఏమిటి... ఎక్కడినించి తీసుకొచ్చారన్న ప్రశ్నలు ఆమె నోటి నించి రాలేదు. కళ్ళలో కాంతి... మనసులో సంతృప్తితో కృతజ్ఞతగా మావగారి వైపు చూసింది.

రఘు మాత్రం కోపంగా చూశాడు తండ్రి వైపు.

నోటి నుంచి బాణంలా దూసుకొచ్చింది ప్రశ్న అనాథ పిల్లాడా?"

రామ్మూర్తి మాట్లాడే లోపలే మళ్ళీ తనే అన్నాడు "అనాథ పిల్లాడిని పెంచుకునే ఖర్మేవిటి నాకు? నేనింకో పెళ్ళి చేసుకుంటాను".

"ఒక వేళ పిల్లలు పుట్టక పోవడానికి లోపం నీలో ఉండి ఉంటే నీ భార్య ఇంకో పెళ్ళి చేసుకోవడాన్ని నువ్వు హర్షిస్తావా?... లేదు కదూ?"

"నా నిర్ణయాన్ని మార్చడానికి ప్రయత్నించకండి" దురుసుగా అన్నాడు రఘు.

"ప్రేమించి పెళ్ళి చేసుకున్నావు. రెండేళ్ళల్లోనే నీ ప్రేమ ఎంత గొప్పదో తెలిసిపోయింది. మీ పెద్దవాళ్ళు దేనికీ సర్దుకుపోరు... దేనికీ సర్దుకుపోరు అంటూ ప్రతీ రోజూ మమ్మల్ని విసుక్కుంటావు. నిజానికి ప్రతి విషయంలోనూ మేమే నీతో సర్దుకుపోతున్నాం. ఎంతమంది ఇళ్ళల్లోనో సర్దుకుపోయి బతుకుతున్నది మాలాంటి పెద్దవాళ్ళేరా. ఒక్కమాట కూడా మా చెవిని వెయ్యకుండా హఠాత్తుగా ఒకమ్మాయిని వెంట బెట్టుకుని వచ్చి పెళ్ళి చేసుకున్నానంటూ నువ్వింట్లో అడుగు పెడితే సర్దుకు పోయింది మేమే. నీ అంతట నువ్వు కోరి తెచ్చుకున్న అమ్మాయితో సర్దుకు పోలేకపోతున్నది నువ్వే. దయచేసి ఇంకనించీ మమ్మల్ని అలా విమర్శించడం మానేస్తావు కదూ!" ఆయన గొంతులో అభ్యర్థన. ఎన్నాళ్ళగానో నొచ్చుకుంటున్న మనసు వెలువడింది మాటల్లో ఈ రోజు. ఒక కొత్త వ్యక్తిని చూసినట్టుగా ఆశ్చర్యంగా తండ్రి వైపు చూశాడు రఘు.

తను వీళ్ళని సరిగ్గా అర్థం చేసుకోలేదా?

తన ఆలోచనలు సరియైనవి కావా?

అసలు పాత తరం వాళ్ళకి నేటి తరం వాళ్ళు సంజాయిషీ చెప్పుకోవలసిన అవసరం ఉందా? అయినా ఎందుకు చెప్పుకోవాలి? చెప్పుకుంటే మాత్రం వాళ్ళు

ఈ తరం వాళ్ళ అభిప్రాయాలు అర్థం చేసుకోగలరా? చిరాగ్గా తల్లివైపు చూస్తూ అక్కడి నించి కదలబోయాడు.

"ఒక్క నిమిషం ఆగు..." రామ్మూర్తి గొంతు కంచు కంఠంలా మోగింది.

"ఇందాక ఏమన్నావూ? అనాథ పిల్లాడిని పెంచుకునే ఖర్మ ఏమిటన్నావు కదూ?" భర్త ఏం చెప్పబోతున్నాడో ఊహించింది భూదేవి. వచ్చి ఆయన పక్కనే నిలబడింది.

భయంగా చూసింది. రఘు మనసు కలత పడుతుందేమోనన్న ఆదుర్దాతో చేతులు జోడించింది "ఏవండీ..."

"ఫర్వాలేదు. ఇటువంటి సందర్భంలో నిజం చెప్పినా తప్పు లేదు భూదేవీ. నన్ను చెప్పనీ..." శాంత స్వరంతో అన్నాడు రామ్మూర్తి.

"ఏం నిజం?" వింతగా తోచింది రఘుకి... ఏం వినబోతున్నాడు తను?...

"ఆ రోజుల్లో నేను కూడా ఇప్పుడు నువ్వు ఆలోచించినట్టే ఆలోచించి ఉంటే నువ్వీ ఇంట్లో ఉండేవాడివే కాదు. నీకు తల్లిదండ్రులు ఉండే వాళ్ళే కాదు అనాథ పిల్లవాడు కన్న కొడుకులా మా చేతుల్లో పెరిగే వాడే కాదు. మాకంటి దీపంలా తెచ్చుకున్నాం. మా ప్రాణంలా పెంచుకున్నాం... పసి గుడ్డుగా మా చేతుల్లోకి అపురూపంగా తీసుకున్నామే తప్ప... అనాథ పిల్లవాడన్న చీదరింపు మా మనసుల్లో కలగలేదు. ఈ రోజు దాకా ఈ నిజాన్ని చెప్పవలసిన అవసరమే రాలేదు" గొంతు బొంగురుపోయి గుండె చిక్కబట్టినట్టయి మరి మాట్లాడలేక కుర్చీలో కూచుండి పోయాడు రామ్మూర్తి.

కాసేపు కదలికే లేని వాడిలా కొయ్య బొమ్మే అయ్యాడు రఘు.

తన ప్రవర్తనకి... తను మాట్లాడిన మాటలకి తానే సిగ్గుపడుతూ... పశ్చాత్తాపంతో చెమ్మగిల్లిన కళ్ళతో తండ్రి కాళ్ళ దగ్గర నేల మీద కూచున్నాడు. అతని పక్కనే నందిని. భూదేవి దీవించింది వాళ్ళని.

*నవ్య వార పత్రిక, 14 జనవరి 2009*